# కరీంనగర్ కనువిందు చేయాలి

## సబర్మతిలా మానేరు తీరం

- అత్యద్భుత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి
- శాతవాహన నగరాభివృద్ధి సంస్థ ఏర్పాటు
- సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశాలు

-2లో



మానేరు డ్యాం రివర్ ఫ్రంట్ అభివృద్ధికి టాటా గ్రూప్ ప్రతినిధులు రూపొందించిన నమూనా

# కరీంనగర్ కనువిందు చేయాలి

**ఈనాడు, హైదరాబాద్:** కరీంనగర్ పట్టణ శివారులోని దిగువ మానేరు డ్యామ్, దాని పరిసరాలను అత్యద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. దేశంలో ప్రప్రథమంగా చేపట్టిన సబర్మతీ రివర్ ఫ్రంట్ తరహాలో మానేరు రివర్ ఫ్రంటు ఉండాలన్నారు. తెలంగాణ రావడానికి మొదటి మహాసభ పెట్టిన కరీంనగర్ సమగ్రాభివృద్ధికి అద్భుతమైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. హైదరాబాద్‌లో లేని ఆకర్షణలు కరీంనగర్‌లో ఉండాలి. హైదరాబాద్ వాసులు సైతం కరీంనగర్‌కు పోవాలన్న ఆసక్తి కలిగించాలన్నారు. మానేరు పర్యాటక కేంద్రంగా, కరీంనగర్ పర్యాటక ప్రాంతం (హబ్)గా మారాలి. మానేరు రివర్ ఫ్రంట్‌పై మంగళవారం ప్రగతిభవన్‌లో ఆయన సమీక్షించారు. ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సీఎస్ ఎస్పీసింగ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాటా బృందం ప్రతినిధులు పనేష్, సూర్యప్రకాష్ మానేరు రివర్ ఫ్రంట్‌పై దృశ్యాత్మక ప్రదర్శన ఇచ్చారు. సాంస్కృతిక, ఆహ్లాదకర కార్యక్రమాల గురించి ఇందులో వివరించారు. దీనికి వీక్షించిన అనంతరం సీఎం మాట్లాడారు. "సబర్మతీ రివర్ ఫ్రంట్‌ను అధ్యయనం చేయాలి. అక్కడున్న ఆకర్షణలు, సదుపాయాలను మానేర్ డ్యామ్ వద్ద కల్పించాలి. ప్రాజెక్టును సమగ్రంగా పరిశీలించి, మరింత లోతుగా అధ్యయనం చేయాలి. కరీంనగర్‌కున్న పురాతన చరిత్రకు మానేరు అద్దంపట్టాలి. కరీంనగర్‌ను అందమైన నగరంగా తీర్చిదిద్దడానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆలోచించాలి. నగరంలో హరిత వనాలను ఏర్పాటు చేసుకోవాలి. ఖాళీ స్థలాల్లో రాగి, వేప, సిల్వర్ ఓక్‌లాంటి చెట్లను పెంచాలి. శాతవాహన విశ్వవిద్యాలయం చుట్టూ కేబీఆర్ పార్కు తరహాలో హరితనడక దారి (గ్రీన్‌వాక్‌వే) ఏర్పాటు చేయాలి. చెట్ల పెంపకానికి అక్కడో అటవీ అధికారిని నియమించాలి. కరీంనగర్ అభివృద్ధిపై మరింత లోతుగా చర్చించడానికి బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తా' అని సీఎం చెప్పారు.

**కరీంనగర్‌కు శాతవాహన నగరాభివృద్ధి సంస్థ:** హైదరాబాద్, వరంగల్‌లలోని నగరాభివృద్ధి సంస్థల మాదిరే కరీంనగర్‌లోనూ కొత్తగా శాతవాహన నగరాభివృద్ధి సంస్థ (సుడా)ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. మంగళవారం మానేరు రివర్ ఫ్రంట్ సమీక్ష సమావేశంలో దీనిని ప్రకటించారు. కరీంనగర్ నగరంతో పాటు శివారుల్లోని కొన్ని గ్రామాలతో కలిపి దీనిని ఏర్పాటు చేస్తారు.

## నాయీబ్రాహ్మణుల సమస్యలపై త్వరలో సీఎం సమావేశం

తెలంగాణలో నాయీబ్రాహ్మణుల సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకటి రెండు రోజుల్లో జనహితలో సమావేశం నిర్వహించనున్నారు. మంగళవారం ఈ సమావేశం జరపాలని భావించారు. పలువురు నేతలు కూడా వచ్చారు. సమయాభావం వల్ల ఈ సమావేశం జరగలేదు. దీంతో వారితో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ కొంతసేపు చర్చించారు. త్వరలో సీఎంతో సమావేశం జరుపుతామని వెల్లడించారు.



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రితో సమావేశమైన జిల్లా మంత్రి ఈటల, ఎంపీ వినోద్, తదితరులు

## కరీంనగర్ అభివృద్ధిపై

# అందరి దృష్టి..

- నేడు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో సీఎం సమావేశం
- ఆచరణ ముఖ్యమంటున్న స్థానికులు

**ఈనాడు, కరీంనగర్:** మీరు కోరినట్లుగానే నగరాభివృద్ధికి, సుందరీకరణకు అవసరమైన మేరకు భారీగా నిధులిచ్చాం... అయినా అనుకున్నంత వేగంగా అభివృద్ధి పనులు సాగడం లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. జిల్లా, నగర అభివృద్ధిపై ఆయన మంగళవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు తదితరులతో సమీక్షించారు. నగరంలో రూ.కోట్లు వెచ్చించి రైతు బజార్లు నిర్మించినా వీధులపైనే వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. నగరం అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టేందుకు ఓ ప్రత్యేకాధికారిని (ఓఎస్డీ) నియమించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా, నగర అభివృద్ధిపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహణకు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు బుధవారం హైదరాబాద్ రావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. దీంతో పాలనాధికారి సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు అన్ని ముఖ్య శాఖల అధికారులు రాజధానికి పయనమయ్యారు. ఈ నేపథ్యంలో నేడు కరీంనగర్‌లో నిర్వహించాల్సిన జిల్లా అభివృద్ధి సమావేశాన్ని రద్దు చేశారు. ముఖ్యమంత్రి నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రణాళికలు అమలయ్యేలాగా చూడాలని వారు కోరుతున్నారు.